నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
17 | హైదరాబాద్, బుధవారం 6 మార్చి 2024 | HYDERABAD

సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని మంగళవారం ప్రధాని నరేంద్రమోదీ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారి ఫోటోను బహూకరించారు.

నకిలీ పాస్‌పోర్టు కేసులో..

మీసేవ యజమాని, ఇద్దరు ఏఎస్ఐల రిమాండ్

నాంపల్లి కోర్టులు, మార్చి 5 (నమస్తే తెలంగాణ) : నకిలీ పాస్‌పోర్టు కేసులో మీసేవ యజమాని, ఇద్దరు ఏఎస్ఐలను రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే.. యూసుఫ్‌గూడలో కళ్యాణ్ అనే వ్యక్తి 2008లో మీసేవ సెంటర్‌ను ప్రారంభించాడు. ఈ క్రమంలో అబ్దుల్ సత్తార్‌తో పరిచయం ఏర్పడింది. వీరిద్దరు కలిసి నకిలీ సర్టిఫికెట్లను రూపొందించి శ్రీలంక జాతీయులకు విక్రయించారు. పాస్‌పోర్టు విచారణ కోసం వచ్చిన మారేడ్‌పల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న తిప్పన్న, పంజాగుట్ట ట్రాఫిక్ ఏఎస్ఐ షేక్‌నజీర్ బాషా అక్రమాలకు పాల్పడినట్లు తేలింది. దీంతో మంగళవారం 6వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సీఐడీ అధికారులు ముగ్గురిని అరెస్టు చేసి లక్డీకాపూల్ కార్యాలయానికి తరలించి విచారించిన అనంతరం కోర్టు ఎదుట హాజరుపర్చగా 14 రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీకి తీసుకొని అధికారులు చంచల్‌గూడ జైలుకు తరలించారు.

సికింద్రాబాద్ సెయింట్ జాన్ బాప్టిస్టు చర్చి పునరుద్ధరణ

సిటీబ్యూరో, మార్చి 5 (నమస్తే తెలంగాణ): సికింద్రాబాద్‌లోని బాప్టిస్టు చర్చి పునరుద్ధరణకు హెచ్ఎండీఏ శ్రీకారం చుట్టింది. నగరంలో చారిత్రాత్మక కట్టడంగా ఉన్న సెయింట్ జాన్ బాప్టిస్ట్ చర్చికి గుర్తింపు ఉంది. ఈ నేపథ్యంలో నగరంలో చారిత్రాత్మక కట్టడాల పునరుద్ధరణ, పరిరక్షణ నేపథ్యంలో భాగంగా బాప్టిస్టు చర్చి కోసం రూ.1.35 కోట్లను వెచ్చించేందుకు హెచ్ఎండీఏ అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. పునరుద్ధరణ పనులను చేపట్టేందుకు కాంట్రాక్టర్లను ఎంపిక చేసేందుకు మంగళవారం హెచ్ఎండీఏ అధికారులు టెండర్లు పిలిచారు. త్వరలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి, పునరుద్ధరణ పనులు చేపట్టనున్నారు.

వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశాలు

దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్ కలెక్టరేట్, మార్చి 5 : వచ్చే విద్యా సంవత్సరానికి వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశానికి గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరానికి గానుబోయినిపల్లిలో ఏర్పాటు చేసిన వాటర్ స్పోర్ట్స్ అకాడమీని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించనున్నారు. అకాడమీలో కాయకింగ్, కెనోయింగ్, సెయిలింగ్ తదితర వాటిలో శిక్షణనిస్తారు. ఎత్తు, బరువు, స్టాండింగ్ బ్రాండ్ జంప్, వర్టికల్ జంప్, మెడిసిన్ బాల్ త్రో, 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, 800 మీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించి, ప్రతిభ ఆధారంగా 5వ తరగతి ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశం కల్పించనున్నారు. 10 మంది బాలికలు, 10 మంది బాలురకు అవకాశం కల్పించనున్నారు. ఆగస్టు 1 నాటికి 9 నుంచి 11 ఏండ్లలోపు కలిగి ఉండి, ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న వారు ప్రవేశానికి అర్హులు. విద్యార్థులు ఈ నెల 12 వరకు జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చేయి తడిపితే..

బర్త్, డెత్ సర్టిఫికెట్

నాన్ అవైలెబులిటీ సర్టిఫికెట్ లేకుండానే మంజూరు

ఫలక్‌నుమా సర్కిల్‌లో వెలుగులోకి

జీహెచ్ఎంసీ అధికారుల మిలాఖత్

ఏఎంఓహెచ్ఓల పనితీరుపై ఆరోపణలు

అడ్డుకట్ట వేయలేకపోతున్న ఉన్నతాధికారులు

సిటీబ్యూరో, మార్చి 5 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నకిలీ జనన, మరణ ధ్రువపత్రాల జారీకి అడ్డుకట్ట పడడం లేదు. నాన్ అవైలెబులిటీ సర్టిఫికెట్ లేకుండానే బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్లను అధికారులు జారీ చేస్తున్నారు. గతంలోనే 31,454 ధ్రువపత్రాలను గుర్తించిన అధికారులు మీ సేవా సెంటర్ నిర్వాహకులపై మాత్రమే చర్యలు తీసుకోగా.. అసలు బాధ్యులైన అధికారులపై పెద్దగా చర్యలు తీసుకోలేదు. దీంతో రెచ్చిపోతున్న సంబంధిత విభాగం అధికారులు నకిలీ జనన, మరణ ధ్రువపత్రాల జారీలో అవినీతి దందాకు తెరలేపారు. తాజాగా ఫలక్‌నుమా సర్కిల్ కార్యాలయం నుంచి నాన్ అవైలెబులిటీ సర్టిఫికెట్ లేకుండా దాదాపు 80 సర్టిఫికెట్లు జారీ చేశారని తెలుస్తున్నది. 1998లో జన్మించిన వ్యక్తికి గతేడాది నవంబర్‌లో నాన్ అవైలెబులిటీ కింద సర్టిఫికెట్ జారీ చేసినట్లు తెలిసింది. ఇదే రకంగా ఖైరతాబాద్, సికింద్రాబాద్, సంతోష్‌నగర్, చార్మినార్, గోషామహల్ సర్కిల్‌లలో నకిలీ జనన, మరణ ధ్రువపత్రాల జారీ జరుగుతున్నట్లు ప్రచారం సాగుతున్నది. ఇటీవల నకిలీ ఫింగర్ ప్రింట్స్‌తో రూ.84 లక్షలను సంస్థ ఖజానాకు కన్నం పెట్టిన ఘటన మరువకముందే నకిలీ జనన, మరణ ధ్రువపత్రాల జారీ అక్రమాలు వెలుగులోకి రావడం చర్చనీయాంశంగా మారింది.

అమలు కాని 'ఇన్‌స్టంట్ అప్రూవల్'

జీహెచ్ఎంసీ పరిధిలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో అవినీతిని చెక్ పెట్టాలన్న ఉద్దేశంతో 2022 ప్రారంభంలో 'ఇన్‌స్టంట్ ఆప్రూవల్' విధానాన్ని తెరపైకి తీసుకువచ్చి అమలు చేస్తున్నారు. దవాఖానల్లో జరిగే జనన, మరణాల ధ్రువపత్రాల ఆధారంగా జీహెచ్ఎంసీ జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తుంది. వివరాలను నమోదు చేసి, సరైన పత్రాలను అప్‌లోడ్ చేస్తే సంబంధిత అధికారులు వాటిని పరిశీలించి వెంటనే ఆన్‌లైన్‌లోనే సర్టిఫికెట్ మంజూరు చేస్తారు. ఐతే మరో విధానంలో భాగంగా దవాఖానల్లో కాకుండా ఇంటి వద్ద జరిగే జనన, మరణాల వివరాలు ఆస్పత్రుల్లో అందుబాటులో ఉండవు. అందుకే వీటిని నాన్ అవైలెబులిటీగా పేర్కొంటారు. అంటే ఆస్పత్రుల నుంచి జీహెచ్ఎంసీకి అందే వివరాల్లో లేని వాటిని నాన్ అవైలెబులిటీ కింద ఆర్డీవో ఇచ్చే పత్రాలను ఆధారంగా చేసుకుంటారు. రెవెన్యూ అధికారులు నాన్ అవైలెబులిటీ కింద ధ్రువీకరణ చేసేందుకుగాను ప్రత్యేక ప్రక్రియ ఉంటుంది. ఇందులో భాగంగా సదరు దరఖాస్తుదారుడు దరఖాస్తు చేసుకున్న తర్వాత క్షేత్రస్థాయి పరిశీలన చేసి వివరాలన్నీ సక్రమంగా ఉన్నాయనుకుంటే బహిరంగ నోటీసు జారీ చేస్తారు. నిర్ణీత సమయంలోపు ఎలాంటి అభ్యంతరాలు రానట్లయితే నాన్ అవైలెబులిటీ పత్రాన్ని జారీ చేస్తారు. దాని ఆధారంగా మీ సేవలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇక్కడే జీహెచ్ఎంసీ అధికారులు కొందరు ముందుగానే మిలాఖత్ అవ్వడంతో నాన్ అవైలెబులిటీ పత్రం కింద తెల్ల కాగితాలు ఉన్నప్పటికీ జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను జారీ చేస్తున్నారు. ఏఎంఓహెచ్ఓల పనితీరుపై నిఘా పెట్టాలన్న డిమాండ్ వ్యక్తమవుతుంది.

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

పొలిటికల్ పార్టీ ప్రతినిధుల సమావేశంలో ఎన్నికల అధికారి రొనాల్డ్‌రాస్

సిటీబ్యూరో, మార్చి 5 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికలు పారదర్శకంగా, సజావుగా జరిగేలా పొలిటికల్ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్ కోరారు. మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో పొలిటికల్ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. త్వరలో భారత ఎన్నికల సంఘం పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉందన్నారు. 16 ఈవీడీఎం డెమాన్ స్టేషన్ కేంద్రాల ద్వారా, అలాగే 15 నియోజకవర్గాల అసెంబ్లీ సెగ్మెంట్లలో ఆర్ఓ కార్యాలయాల్లో ఈవీడీఎంలపై ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరించనున్నట్లు ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితాను ప్రచురించారని, ఆ జాబితా మేరకు జిల్లాలో 45,70,138 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 23,30,574 మంది పురుష ఓటర్లు, 22, 39,240 మహిళా ఓటర్లు, థర్డ్ జెండర్ 324 మంది ఉన్నారు.

ఫిర్యాదులపై విచారణ చేయాలి..

నియోజకవర్గ స్థాయిలో ప్రతి బుధవారం పొలిటికల్ పార్టీల సమావేశాలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రొనాల్డ్‌రాస్ తెలిపారు. ఈ సందర్భంగా పొలిటికల్ పార్టీల ప్రతినిధులు ఇచ్చిన ఫిర్యాదులను తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో విచారణ చేయాలని అధికారులను ఆదేశించారు. పొలిటికల్ పార్టీల ప్రతినిధులు ఎంఐఎం ప్రతినిధి, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్, బీఎస్పీ ప్రతినిధి కల్యాణి, బీజేపీ ప్రతినిధి వీఎస్ భరద్వాజ్, కాంగ్రెస్ ప్రతినిధి నిరంజన్, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చీరకట్టి.. తళుక్కున మెరిసి

ఖైరతాబాద్, మార్చి 5 : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా మణులు చీరకట్టి.. తళుక్కున మెరిసిపోయారు. భారత ప్రభుత్వ టెక్స్‌టైల్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా ఏర్పాటు చేసిన 'వన్ భారత్ సారీ వాకథాన్'ను కేంద్ర రైల్వే, టెక్స్‌టైల్స్ మంత్రి దర్శన జర్దోష్, కేంద్ర పర్యాటక, సాంస్కృతి శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి, రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ ప్రారంభించారు. వందలాది మంది మహిళలు చీర ధరించి ఈ వాక్‌లో పాల్గొని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత ఆనంద్ శంకర్, నారాయణ విద్యాసంస్థల చైర్మన్ శ్రీవిద్య, హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కమిషన్ డాక్టర్ వీణా, ఎన్‌హెచ్‌డీసీ ఎండీ రీటా, బిగ్‌బాస్ ఫేమ్ దివ్య, మహిళలు, విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులు నృత్యప్రదర్శనలో అలరించారు.

ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత మహేశ్వరంలో వెలిసిన కాంగ్రెస్ నాయకుల ప్లెక్సీలు

అధికార పార్టీకి ఎన్నికల కోడ్ పట్టదా?

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నా.. మహేశ్వరంలో వెలిసిన కాంగ్రెస్ ప్లెక్సీలు

కలెక్టర్ ఆదేశాలను పట్టించుకోని స్థానిక అధికారులు

బడంగ్‌పేట, మార్చి 5 : అధికార పార్టీ నేతలు ఎన్నికల కోడ్‌ను ఉల్లంగిస్తున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నడుస్తుండగా కాంగ్రెస్ నాయకులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో ఎక్కడ చూసినా ఆ పార్టీ నాయకుల ప్లెక్సీలే దర్శనమిస్తున్నాయి. అయితే బీఆర్ఎస్, బీజేపీ, ఇతర పార్టీలకు సంబంధించిన ప్లెక్సీలు, హోర్డింగ్‌లను పెట్టకుండా అడ్డుకుంటున్న అధికారులు కాంగ్రెస్ పార్టీ నేతల ప్లెక్సీలపై స్పందించడం లేదని మండిపడుతున్నారు. ఈ విషయమై మంగళవారం కలెక్టర్ సీరియస్ అయ్యారు. అయినప్పటికీ స్థానిక అధికారులు పట్టించుకోక పోవడంపై వివిధ పార్టీల నాయకులు అభ్యంతరం తెలుపుతున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకుల ప్లెక్సీలు తొలగించకపోతే ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

ఎన్నికల వేళ.. హైడ్రామా!

అంచనాలు, డిజైన్లు లేకుండానే స్కైవే పనులకు 7న సీఎం శంకుస్థాపన

సిటీబ్యూరో, మార్చి 5 (నమస్తే తెలంగాణ): ఎన్నికల ముందు ఏం చేసినా చెల్లుతుందిలే అన్నట్లుగా వ్యవహరిస్తోంది కాంగ్రెస్ ప్రభుత్వం. ప్రతిష్టాత్మకమైన అభివృద్ధి ప్రాజెక్టులను చేపట్టాలంటే సాంకేతికంగా రకరకాల అనుమతులు, డిజైన్లు, వ్యయం ఇలా ఎన్నో అంశాలపై పూర్తి స్థాయిలో నివేదికలు సిద్ధం చేయాలి. కానీ, ఇవేమీ లేకుండానే ప్రాథమికంగా ప్రతిపాదనల దశలో ఉన్న రెండు భారీ స్కైవేల నిర్మాణ ప్రాజెక్టు పనులకు ఏకంగా శంకుస్థాపన చేసేందుకు ముహూర్తం ఖరారు చేశారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ నుంచి తూంకుంట వరకు రాజీవ్ రహదారిపై, ప్యారడైజ్ నుంచి కండ్లకోయ వైపు ఉన్న నాగ్‌పూర్ జాతీయ రహదారిపై భారీ ఫ్లై ఓవర్లు నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈనెల 7న స్టేట్ హైవే-1పై ఎలివేటెడ్ కారిడార్, 9వ తేదీన ఎన్‌హెచ్- 44పై ఎలివేటెడ్ కారిడార్‌లకు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా రెండు స్కైవే ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం పురపాలక శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతిపాదించిన ఈ రెండు స్కైవేల నిర్మాణానికి సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో వందకు పైగా ఎకరాల భూములు అవసరం ఉండటంతో ఏళ్ల తరబడి పెండింగ్‌లోనే ఉంది. వారం రోజుల క్రితం రక్షణ శాఖ అంగీకరించడం, వెంటనే పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తుండటంతో హడావిడిగా శంకుస్థాపన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

నిబంధనలు పెట్టిన రక్షణ శాఖ

ఈ రెండు భారీ ప్రాజెక్టులను చేపట్టేందుకు రక్షణ శాఖ నిబంధనలు పెట్టింది. వాటి గురించి సమగ్ర అధ్యయనం, ప్రాజెక్టు డిజైన్, వ్యయం అంచనాలను రూపొందించకుండానే శంకుస్థాపన చేయడం.. వచ్చే పార్లమెంటు ఎన్నికల స్టంట్ అని పలువురు విమర్శిస్తున్నారు. ముఖ్యంగా ఈ ప్రాజెక్టుల నిమిత్తం హెచ్ఎండీఏ ఉన్నతాధికారి, సికింద్రాబాద్ కంటోన్మెంట్ సీఈఓ, డిఫెన్స్ ఎస్టేట్ అధికారి, స్థానిక మిలిటరీ అథారిటీ.. ఇలా నలుగురు సభ్యులతో కూడిన బోర్డు ఏర్పాటు చేస్తున్నట్లు రక్షణ శాఖ ప్రకటించింది. ఇది ఎంతో కీలకమైనప్పటికీ ఇప్పటి వరకు బోర్డు మీటింగ్‌లో భూముల అప్పగింత, ప్రాజెక్టు చేపట్టే తీరుపై ఎలాంటి సమావేశం జరగలేదు. కానీ హడావిడిగా శంకుస్థాపనకు ముహూర్తం ఖరారు చేశారు.

కీసరగుట్టకు రండి.. సీఎం రేవంత్‌కు ఆహ్వానం

కీసర, మార్చి 5 : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా కీసరగుట్టకు రావాలని సీఎం రేవంత్‌రెడ్డిని కీసరగుట్ట ఆలయ దేవస్థానం ప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు కోరారు. మంగళవారం సీఎంను కలిసిన వారిలో ఆలయ చైర్మన్ తటాకం నాగలింగంశర్మ, ఈఓ నరేందర్, జిల్లా పరిషత్ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు తోటకూర వజ్రేష్‌యాదవ్, సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, కీసరగుట్ట ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు ఉన్నారు.

హుస్సేన్‌సాగర్‌లోకి శుద్ధిచేసిన జలాలు

రూ.7.19 కోట్లు వెచ్చిస్తున్న ప్రభుత్వం

14 నెలల పాటు నిర్వహణకు టెండర్లు

సిటీబ్యూరో, మార్చి 5 (నమస్తే తెలంగాణ) : నగరం నడిబొడ్డున పర్యాటక కేంద్రంగా మారిన హుస్సేన్‌సాగర్ పరిశుభ్రతకు పెద్ద పీట వేస్తున్నారు. హుస్సేన్‌సాగర్‌లోకి వచ్చే మురుగునీటికి చెక్ పెట్టేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాచరణ రూపొందించింది. ప్రస్తుతం మూడు చోట్ల ఉన్న ఎస్‌టీపీలతో పాటు మొత్తం 7 చోట్ల ఉన్న ఐ అండ్ డీల నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు ప్రతిపాదనలు రూపొందించింది. 14 నెలల పాటు హుస్సేన్‌సాగర్‌లోకి మురుగునీరు చేరకుండా, శుద్ధి చేసిన నీటిని మాత్రమే వదిలేలా పనులను కాంట్రాక్టర్లకు అప్పగించనున్నారు. ఇందుకోసం మొత్తం రూ.7.19 కోట్లు వెచ్చించనున్నారు.